క్లుప్తంగా

నేడు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని రాజగోపాలపురంలో ఉన్న శ్రీకృష్ణ రామాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు యాదవ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఉదయం గణపతి పూజ, మహిళలతో సామూహిక కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి శ్రీకృష్ణ భగవానుని నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు.

గ్రామాల్లో కృష్ణాష్టమి సందడి

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శ్రీకృష్ణ మందిరాల్లో ఆదివారం నుంచే కృష్ణాష్టమి సందడి నెలకొంది. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నేలపట్టు, మానేరి ఉచ్చూరు తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణ మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిన్న పిల్లలకు కృష్ణుడు, గోపికల వేషాలు ధరింపజేస్తున్నారు.

కండలేరులో 5.898 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 5.898 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 650 క్యూసెక్కుల నీరు వస్తోందని పేర్కొన్నారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 85, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్ర సేనమ్మ, ఈవో నవీన్‌కుమార్, ట్రస్టుబోర్డు సభ్యులు దువ్వూరు చంద్రారెడ్డి పర్యవేక్షించారు.

తాళ్లమ్మకు సామూహిక పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో తాళ్లమ్మ

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మకు గ్రామస్తులు ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టారు. గత నెలలో అమ్మవారికి కొలుపు వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో నెల పొంగళ్లు పెట్టినట్టు గ్రామస్తులు తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు

ఓజిలి: ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో ఆదివారం వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్టు, రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి వైద్యులు మందులు పంపిణీ చేశారు. వసంతలక్ష్మి, మహేష్, వైద్యులు మాల్యాద్రి, సంపత్, విజయ పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

కోట: బీసీ కులాల ఐక్యతకు కృషి చేసిన బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతిని ఆదివారం కోటలో ఘనంగా జరుపుకున్నారు. రవినగర్‌లోని బీసీ కులాల ఐక్యవేదిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో 50 శాతం ఉన్న బీసీలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని తెలిపారు. కులగణన చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం పంచాయతీ బాలగోపాలపురం గిరిజన కాలనీలో రమేష్, భార్య లక్ష్మమ్మ దంపతుల పూరిల్లు ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదయ్యింది. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. ఇంట్లో దాచుకున్న రూ.15 వేలు, వంట సరుకులు, ఫ్యాను, సిలిండర్, మంచాలు, దుస్తులు కాలిపోయాయి.

మందుబాబులతో ఇబ్బందులు



రాత్రయితే తొగరాముడి పీహెచ్‌సీ ఆవరణలోనే మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రిళ్లు పీహెచ్‌సీలో విధులు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నాము. దానికి తోడు ఆవరణం చీకటిగా ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి.

– జె.రాజకుమారి, ఏఎన్ఎం, తొగరాముడి పీహెచ్‌సీ, దొరవారిసత్రం

రాత్రిళ్లు భద్రత పెంచాలి



ఆస్పత్రిలో మహిళా డాక్టర్లు, సిబ్బంది రాత్రి సమయాల్లో డ్యూటీ చేసేటప్పుడు మంచి అనుభవం, కరాటే నైపుణ్యం కలిగిన ఉమెన్ కాని స్టేబుళ్లకు గస్ సదుపాయం కల్పించి భద్రత పెంచాలి. రాత్రి వేళల్లో ఆసుపత్రిలో ఉన్న వారందరిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. అలాగే ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. తద్వారా ధైర్యంగా సేవలు అందించే వీలు ఉంటుంది. – మల్లీశ్వరి, స్టాఫ్‌నర్స్ పెళ్లకూరు పీహెచ్‌సీ

హోరు గాలి.. బోటు ఖాళీ


ఖాళీ బోట్లతో ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

నెల రోజులుగా సముద్రంపై ప్రతికూల వాతావరణం నెలకొంది. హోరుగాలి వీస్తోంది. బోట్లు నిలబడడలేక తిరగబడుతున్నాయి. దీంతో చేపల వేట సజావుగా సాగడం లేదు. వేకువ జామున నిద్రలేచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు రోజంతా వేట చేపట్టినా ఒక్క చేప కూడా దొరకడం లేదు. వారు నిరాశతో ఇంటి బాట పడుతున్నారు. చేపలు దొరక్కపోవడంతో కుటుంబాల పోషణ కష్టంగా ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సముద్రంలో వలకు చిక్కని చేపలు
- తిరగబడుతున్న బోట్లు
- నిరాశతో తిరిగి వస్తున్న మత్స్యకారులు
- భారమవుతున్న కుటుంబ పోషణ

వాకాడు: మండలంలో తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, దుగ్గరాజపట్నం, శ్రీనివాసపురం, పంబలి, పులింజేరివారిపాళెం, ఓడపాళెం, వైట్‌కుప్పం, పూడికుప్పం, చినతోట, పూడిరాయిదొరువు, నవాబుపేట, 13 గ్రామాల్లో 6000 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. 325 ఆయిల్ ఇంజిన్ బోట్లు ఉన్నాయి. ఒక్కో బోటుపై దాదాపు 3 నుంచి 5 కుటుంబాల వరకు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా వేటకు వెళ్లిన జాలర్లు రోజుకు బోటుకు సుమారు టన్ను చేపలు పట్టుకుని వస్తారు. కిలో చేపలు రూ.100 నుంచి రూ.150 మధ్య ధర పలుకుతాయి. ఒక్కో బోటులో ఐదుగురు జాలర్లు వేటను కొనసాగిస్తారు. కొంతమేర వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ చేసుకుంటారు.

ఈ ఏడాది అసాధారణం

వేట విరామం తర్వాత సముద్రంలో మత్స్యసంపద ఎక్కువగా దొరుకుతుంది. దీంతో మత్స్యకారులు ఎంతో ఆశతో సముద్రంలోకి వేటకు వెళతారు. ఎక్కువగా చేపలు లభిస్తే కేరళ నుంచి వచ్చే వ్యాపారులు వాటిని కొనుగోలు చేస్తారు. అలాగే కర్ణాటకకు కూడా ఎగుమతి చేస్తారు. ధర కూడా బాగానే ఉంటుంది. అలాంటిది ఈ ఏడాది సముద్రంలో చేపలు ఉన్నప్పటికీ హోరు గాలి కారణంగా వేట చేయలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క ముఖద్వారాలు పూడిపోవడంతో బోట్లు సముద్రం లోపలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. రెండు నెలలుగా ఒక్క చేప కూడా దొరక్కపోగా శ్రమతోపాటు, డీజిల్ ఖర్చులు పెరిగిపోతున్నాయి.


తిరగబడిన బోటును ఒడ్డుకు లాగుతున్న మత్స్యకారులు

అందని వేట విరామం సాయం

చేపల వేటే జీవనాధారంగా చేసుకున్న మత్స్యకారులకు రెండు నెలలుగా చేపలు దొరకడం లేదు. తెల్లవారు జామునే వల భుజాన వేసుకుని సముద్రంలోకి వెళ్లి సాయంత్రం నిరాశతో వెనక్కి వస్తున్నారు. ప్రస్తుతం బోట్లను ఒడ్డుకు చేర్చి లంగరు వేసి ఖాళీగా ఉన్నారు. ఈ పరిస్థితి అన్ని మండలాల మత్స్యకార గ్రామాల్లోనూ నెలకొంది. కొంతమంది ఏమి చేయాలో తెలియక దినసరి కూలీలుగా మారుతున్నారు. చేపల వేట విరామంలో ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడం పరిపాటి. ఈ ఏడాది ఇప్పటి వరకు సాయం అందలేదు. ఈ నేపథ్యంలో వేటలేక, పూట గడవక మత్స్యకారులు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణం సాయం అందించాలని కోరుతున్నారు.

చేపల వేట చేయలేకున్నాం



గత రెండు నెలలుగా సముద్రంపై గాలి ఎక్కువగా వీస్తుండడంతో చేపల వేట చేయలేకున్నాం. బోట్లు ఒక్క చోట నిలవక తిరగబడుతున్నాయి. ప్రస్తుతం సముద్రంలో మత్స్య సంపద పుష్కలంగా ఉన్నప్పటికీ గాలితో రోజంతా సముద్రంతో కుస్తీపడినా ఒక్క చేప కూడా దొరకడంలేదు. బోట్లు ఒడ్డుకు చేర్చి ఖాళీగా ఉన్నాము. – సోమయ్య, తూపిలిపాళెం

ఒక్క చేప కూడా చిక్కడం లేదు



సముద్రంలో నిత్యం పోరుగాలి వీస్తోంది. మధ్యలోకి వెళ్లిన బోట్లు ఒక చోట నిలవడం కష్టంగా ఉంది. వల వేసినా గాలికి పైకి లేస్తుండడంతో మత్స్య సంపద చెల్లాచెదరవుతోంది. రోజంతా గాలించినా ఒక్క చేప కూడా చిక్కడంలేదు. దీనికితోడు వేట విరామ సాయాన్ని ప్రభుత్వం ఇవ్వలేదు. జీవనం కష్టంగా ఉంది.

– పోలయ్య, కొండూరుపాళెం

ముఖద్వారాలు పూడిపోయాయి



ముఖద్వారాలు పూడిపోవడంతో సముద్రంలోకి బోట్లు వెళ్లలేని పరిస్థితి. బోటును లోపలికి నెట్టాలంటే ఇతర వాహనాలకు బాడుగ చెల్లించాల్సి వస్తోంది. అరకొరగా వేట సాగినప్పటికీ ఖర్చులకే సరిపోవడం లేదు. కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి ముఖ ద్వారాల పూడిక తీయించాలి.

– మునస్వామి, ఓడపాళెం

ఆకట్టుకున్న అంతరిక్ష ఛాయా చిత్రాల ప్రదర్శన


ప్రతిజ్ఞ చేస్తున్న వక్తలు

గూడూరు రూరల్ : జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాలకు చెందిన 23 పాఠశాలలకు చెందిన విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై వేసిన చిత్రాలను ప్రదర్శించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తాము తీసుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ భారతదేశం అంతరిక్షంలో సాధిస్తున్న విజయాలను ఆదర్శంగా తీసుకుని పండుగలా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్తమ ప్రదర్శనలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. భావితరాలకు మంచి వాతావరణం అందిస్తామని పేర్కొంటూ ప్రతిజ్ఞ చేశారు.

అధ్వానంగా సైదాపురం బస్టాండ్


గుంతలు పడిన రోడ్డు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం బస్టాండ్ గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో పాదచారులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కైవల్యానది వంతెన నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డులో అడుగుకో గుంత ఉంది. గత ప్రభుత్వం ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు మంజూరు చేసింది. పనులను కూడా ప్రారంభించారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత వచ్చిన ప్రభుత్వం పనుల గురించి పట్టించుకోలేదు. ఈ మధ్య కురిసన వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను ప్రారంభించి కష్టాలు తీర్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా చెంగాళ పరమేశ్వరి గ్రామోత్సవం

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పసుపునీళ్లు చల్లుకుని వసంతోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త బొప్పన తిలక్‌బాబు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లఖ్‌పతి దీదీలుగా చేయడమే లక్ష్యం



చిల్లకూరు : మాట్లాడుతున్న సంఘమిత్రల ఏపీఎం గునయ్య

చిల్లకూరు : పొదుపు మహిళలను లఖ్‌పతి దీదీలుగా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని సంఘమిత్ర ఏపీఎం గునయ్య తెలిపారు. స్థానిక మండల సంఘమిత్ర కార్యాలయంలో ఆదివారం వీవోఏలతో పాటు సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులకు లఖ్‌పతి దీదీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రతి మహిళకూ ఏడాదిలో కొంత మొత్తాన్ని అందించి ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు శిక్షణ ఇస్తోందని తెలిపారు. తద్వారా వారు తమ కాళ్లపై నిలబడి కుటుంబాలకు అండగా ఉండేలా చేస్తున్నట్టు పేర్కొన్నారు. వీవోఏలు ప్రతి గ్రామంలోనూ సంఘబంధాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలను సక్రమంగా నిర్వహిస్తున్న గ్రూపులను గుర్తించి, ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం లఖ్‌పతి దీదీలుగా ఎంపికైన ఐదుగురికి పెసిలిటేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు మమత, ఉచ్చూరు వెకంటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లఖ్‌పతి దీదీ సర్టిఫికెట్ల పంపిణీ

దొరవారిసత్రం : స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు లఖ్‌పతి దీదీ సర్టిఫికెట్లను వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి అందజేశారు. ఏపీఎం పద్మావతి మాట్లాడుతూ 34 మంది వీవోఏల పరిధిలో ఉన్న గ్రామాల్లో 170 మంది మహిళలను లఖ్‌పతి దీదీ పథకానికి ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ క్రమంలో వారికి 100 రోజుల్లో జీవనోపాధి కల్పిస్తూ ఏవిధంగా లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, సీసీ చంద్రయ్య, నాయకులు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దీవీ సత్రంలో లబ్ధిదారులకు సెర్టిఫికెట్లు అందజేత, రాపూరు: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏపీఎం మాధవి

ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడమే లక్ష్యం

రాపూరు : ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడమే లఖ్‌పతి దీదీ లక్ష్యమని ఏపీఎం మాధవి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం లఖ్‌పతి దీదీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ లఖ్‌పతి దీదీ పథకాన్ని మహారాష్ట్రలో ప్రారంభించారని గుర్తు చేశారు. దీని కింద ఏడాదికి రూ.లక్ష ఆదాయం ఉన్న సామాన్య మహిళను లక్షాధికారిగా చేస్తామని తెలిపారు.

వ్యక్తి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీ 2వ వార్డుకు చెందిన చేనేత కార్మికుడు సజ్జా ఈశ్వరయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్వీఆర్ చారిటబుల్ సొసైటీ అధినేత నక్కా వెంకటేశ్వరరావు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అప్పిన కాంతారావు, రాజేశ్వరావు, శేషగిరి, నరసింహులు, శీను, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు రూరల్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు చేపట్టారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ ఒక్క చోట చేరి తమలోని క్రీడా నైపుణాలను వెలికి తీసేలా ప్రగతి సంస్థ ప్రయత్నించడం అభినందనీయమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పని ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఏటా సంస్థ ద్వారా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయులైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం రెండు రోజులు జరిగే పోటీల్లో నాలుగు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

పెళ్లకూరు: పార్టీ రాష్ట్ర అధిష్టానం సూచనల మేరకు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం పెన్నేపల్లి, తాళ్వాయిపాడు, కానూరు గ్రామాల్లో సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మురళి, నరసింహులు, సతీష్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పూడిలో బౌద్ధ సంప్రదాయంలో పెళ్లి



ఓజిలి : మండలంలోని తిరుమలపూడి గ్రామంలో ఉన్న అంబేడ్కర్ బౌద్ధ విహార్ వద్ద ఆదివారం బౌద్ధ సంప్రదాయంలో ఏడీపీఎస్ (అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి) నాయకులు పెళ్లి జరిపించారు. పామంజి అఖిల్, కుదిరి పల్లవికి ఏడీపీఎస్ వ్యవస్థాపకుడు ఇంగిలాల రామచంద్రయ్య బౌద్ధ ధర్మ విధానంలో వివాహం జరిపారు. ఈ కార్యక్రమంలో ఏడీపీఎస్ నాయకులు తూపిలి నాగరాజు, గ్రామ పెద్దలు, వధూవరుల బంధువులు పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించారు.

విజ్ఞాన భాండాగారానికి చెదలు




రాపూరులోని గ్రంథాలయం

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని పెద్దలు చెబుతుంటారు. ప్రజలకు పుస్తకాలు, గ్రంథాలు అందుబాటులో ఉంచి సమాచారంతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రామాల్లో గ్రంథాలయాలను ఏర్పాటుచేశారు. వాటి అభివృద్ధి గురించి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పాఠకుల సంఖ్య తగ్గిపోతోంది. కొన్నిచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని చోట్ల పుస్తకాలు పాడైపోయి అలంకారప్రాయంగా మారాయి. రాపూరులోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది.

- తగ్గిన పాఠకుల సంఖ్య
- వసూలు కాని సెస్ బకాయిలు
- గ్రంథాలయాల అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం

రాపూరు: రాపూరులో 1962లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 1989 వరకు అద్దె భవనంలోనే నిర్వహించేవారు. 1989 మే 5న సొంత భవనంలోకి మార్చారు. ఇందులో సుమారు 16 వేల పుస్తకాలు ఉన్నాయి. 1200 మంది సభ్యులు ఉన్నారు. సెస్ మాత్రం వసూలు కావడంలేదు. చిన్నపాటి వర్షానికే భవనం ఉరుస్తుండంతో పుస్తకాలు తడిచిపోతున్నాయి. దీనికితోడు చెదలుపట్టడంతో సుమారు 1000 పుస్తకాల వరకు పాడయ్యాయి. ప్రభుత్వం 2012 నుంచి పుస్తకాలు అందించడం లేదు. పత్రికలు, కొన్ని వారపత్రికలను పంపుతోంది. 2015 నుంచి రెగ్యులర్ లైబ్రేరియన్ లేరు. అటెండర్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్ లేరు. గ్రంథాలయ ఆవరణం పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉంది. మంచినీటి సదుపాయంలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా గూడూరు లైబ్రేరియన్ వ్యవహరిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్డి కూడా లేదు. పాఠకులు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలానికంతా ఉన్న ఒకే ఒక్క గ్రంథాలయం ఇదే. గతంలో మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చే పాఠకులతో కిక్కిరిసేది. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు, పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ట్రెజరీ, మండల ప్రజాపరిషత్, వెలుగు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అతి దగ్గరగా ఉండడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు అధికారులు వచ్చేలోపు ఈ గ్రంథాలయంలోనే గడుపుతారు. ఇటువంటి గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించడంతో పాటు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గ్రంథాలయంలో పత్రికలు చదువుతున్న పాఠకులు


గ్రంథాలయంలోని పుస్తకాలు


వర్షానికి తడిచిన పుస్తకాల మూట

గొప్ప రచనలు పాడవుతున్నాయి



భవనం ఉరుస్తుండడంతో పాత తరం రచయితల గొప్ప రచనలు, పుస్తకాలు తడిచి పాడైపోయాయి. దీంతో ఆ సాహిత్యం ఈ తరం వారికి తెలిసే అవకాశం లేకుండా పోయింది. పాత రచనలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. కొత్త భవనం నిర్మించాలి. రెగ్యులర్ అధికారిని నియమించాలి.

– దందోలు భాస్కర్‌రెడ్డి, జోరేపల్లి, రాపూరు

గ్రంథాలయానికి మరమ్మతులు చేపట్టాలి



గ్రంథాలయానికి అధికారులు మరమ్మతులు చేయించి విలువైన పుస్తకాలను కాపాడాలి. అలాగే మరుగుదొడ్డి నిర్మించాలి. మంచినీటి వసతి కల్పించాలి. రెగ్యులర్ లైబ్రేరియన్, సిబ్బందిని నియమించాలి. నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచితే పోటీ పరీక్షల్లో రాణిస్తారు.

– షేక్ ఆరీఫ్, రాపూరు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



వర్షం కురిస్తే గ్రంథాలయ భవనం అంతా ఉరుస్తోంది. ఎంతో గొప్ప పుస్తకాలు తడుస్తున్నాయి. గ్రంథాలయం శిథిలావస్థ గురించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టవలసి ఉంది.

– బి.ధనమ్మ, ఇన్‌చార్జి లైబ్రేరియన్